# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 17-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ భారత్ వైద్య పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాజస్థాన్‌లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

❖ పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో భాగంగా "ఒక దేశం.. ఒకే ఎన్నిక"కు సంబంధించిన బిల్లులను ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

❖ భారతదేశం ప్రపంచ పునరుత్పాదక ఇంధన రాజధానిగా ఆవిర్భవించనుందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.

❖ రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఆరు సూత్రాల వ్యూహాన్ని సిద్ధం చేసిందని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం వైద్య పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మంగళగిరి జరిగిన ఎయిమ్స్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి మాట్లాడుతూ... వైద్య వృత్తి మానవాళికి సేవ చేసే గొప్ప మార్గమని, సేవా దృక్పథం, నిరంతర అభ్యాసాలతో పరిశోధనలపై దృష్టి సారించాలని వైద్య విద్యార్థులకు సూచించారు. వైద్య చికిత్సలో ఎయిమ్స్ సంస్థ అగ్రగామిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు రాజస్థాన్‌లో పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రాజస్థాన్‌లో భారతీయ జనతా పార్టీ అధికారంలో వచ్చి ఒక సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా 'ఏక్ వర్ష్ - పరిణామ్ ఉత్కర్ష్' పేరిట జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజస్థాన్‌లో 45 వేల కోట్ల రూపాయల విలువైన ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు రైతులు, మహిళలు, యువతకు ప్రయోజనం చేకూరుస్తాయని వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో భాగంగా ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లులను ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాల డిమాండ్ మేరకు జరిగిన ఓటింగ్‌లో బిల్లును ప్రవేశపెట్టేందుకు అనుకూలంగా 269 మంది, వ్యతిరేకంగా 198 మంది సభ్యులు ఓటు వేశారు. కాంగ్రెస్, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ, డిఎంకె, శివసేన (యుబిటి), సిపిఐ (ఎం), తదితర పార్టీల బిల్లులను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించాయి. బిల్లులను తదుపరి పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షలు డిమాండ్ చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ప్రపంచ పునరుత్పాదక ఇంధన రాజధానిగా ఆవిర్భవించనుందని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 5వ సీఐఐ ఇంటర్నేషనల్ ఎనర్జీ కాన్ఫరెన్స్ లో మంత్రి మాట్లాడుతూ.... క్లీన్ ఎనర్జీ స్పేస్‌లో ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత ఆశాజనకమైన దేశాలలో భారత్ ఒకటిగా ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - నవంబర్ నెలల మధ్య, భారత్... సుమారు 15 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించిందని వెల్లడించారు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని కేంద్ర మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఆరు సూత్రాలవ్యూహాన్ని సిద్ధం చేసిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. లోక్‌సభలో ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. ఈ విషయాన్ని వెల్లడించారు. ఉత్పత్తిని పెంచడం, వ్యయాలను తగ్గించడం, ఉత్పత్తులకు న్యాయమైన కనీస మద్దతు ధరలను అందించడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను భర్తీ చేయడం, వ్యవసాయాన్ని వైవిధ్య పరచడం, సహజ, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వంటి ఆరు సూత్రాల ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచవచ్చని వివరించారు. వీటితో పాటు రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం, ఎరువులు, వ్యవసాయ యంత్రాలకు రాయితీలు కల్పించడం వంటివి కూడా చేస్తున్నామని మంత్రి వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభ ప్రశ్నోత్తరాల సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈరోజు మాట్లాడుతూ... గత 3 సంవత్సరాలలో, భారతదేశ స్థూల జాతీయోత్పత్తి (GDP) వృద్ధి రేటు సగటున 8.3 శాతంగా ఉందని, ఇది ప్రపంచ ప్రమాణాల ప్రకారం అద్భుతమైన సంఖ్య అని పేర్కొన్నారు. భారత ఆర్థిక వృద్ధి గణనీయంగా పెరుగుతోందని దీనికి ప్రజల కృషి, దేశ నాయకత్వం కారణమని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=======================

భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి మాతృక అని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీనడ్డా అన్నారు. భారత రాజ్యాంగం 75 ఏళ్ల ఉజ్వల ప్రయాణంపై రాజ్యసభలో ఈరోజు జరిగిన ప్రత్యేక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతీయ నైతికతను అనుసరించి ఇక్కడ ప్రజాస్వామ్యం... స్వేచ్ఛ, సమానత్వం, సమగ్రత లను కలిగి ఉంటుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం... పౌరులు గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపేలా చేస్తుందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయులకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

=======================

శ్రీలంక అధ్యక్షులు అనురా కుమార దిసనాయకే ఈరోజు బీహార్‌లోని బుద్ధగయలో ఉన్న ప్రపంచ వారసత్వ మహాబోధి ఆలయాన్ని సందర్శించారు. 14 మంది సభ్యులతో కలిసి వెళ్ళిన ఆయన ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుద్ధగయ ఆలయ నిర్వహణ కమిటీ కార్యదర్శి డాక్టర్ మహాశ్వేత మహారథి మాట్లాడుతూ... శ్రీలంక అధ్యక్షుడు బుద్ధ భగవానుడికి సంబంధించిన 7 ప్రదేశాలను కూడా సందర్శించారని తెలిపారు.

=======================

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని పునర్నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... గడచిన 8 సంవత్సరాల్లో విద్యార్థులపై వ్యయం 130 శాతం పెరిగిందని తెలిపారు. 2013-14 విద్యా సంవత్సరంలో 10,780 రూపాయలుగా ఉన్న ఖర్చు 2021-22 నాటికి 25,043 రూపాయలకు పెరిగిందని అన్నారు. ప్రధానమంత్రి పోషణ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 1 లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టిందని తెలిపారు. వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్... అంశాన్ని మంత్రి వివరిస్తూ... సుమారు 13 వేల ఈ-జర్నల్స్ ప్రస్తుతం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఎన్‌టీఏ రిక్రూట్‌మెంట్ పరీక్షలకు బదులుగా వచ్చే సంవత్సరంలో ప్రారంభమయ్యే ఉన్నత విద్యా ప్రవేశాల పరీక్షలను నిర్వహించడంపై దృష్టి సారిస్తుందని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 22 సెకన్లు)

=======================

బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్ ఫలితం డ్రా దిశగా పయనిస్తోంది. నాలగవరోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. తృటిలో ఫాలో ఆన్ తప్పించుకున్న భారత్ ఇంకా 193 పరుగుల వెనుకంజలో ఉంది. కాగా రేపు ఒక్క రోజే ఆట మిగిలి ఉంది.

=======================
=======================